

వినాయకా వెళ్లిరా..

● తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం ● పర్యవేక్షించిన ఎస్పీ బిందు మాధవ్


వేలంపాటకు లడ్డూ తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు


స్టెప్పులు వేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి


ఉత్సవాల్లో ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్యే


ఎల్లెల్సీ కెనాల్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ


లడ్డూ వేలంపాటలో పాల్గొన్న నాయకులు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 11: ఆదోని పట్టణంలో వినాయక చవితి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఐదు రోజుల పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలను బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. వాడవాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగించారు. ఉదయం 9:30 గంటలకు విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, జనసేన నాయకుడు మల్లప్ప తదితరులు పాల్గొని వినాయకుడికి పూజలు నిర్వహించారు. యువత పురవీధుల్లో నృత్యాలు చేస్తూ డ్రమ్స్ వాయిస్తూ కోలాహలంగా ఊరేగింపు చేపట్టారు. ఎల్లెల్సీ కాలువ వినాయక ఘాట్ వద్ద వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ సోమన్న పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 850 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి


నిమజ్జనానికి ముందు ఎల్లెల్సీ వద్ద గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న నాయకులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలులో నిమజ్జనానికి ఏర్పాట్లు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 11: వినాయక ఘాట్ వద్ద ఈ నెల 15వ తేదీన జరగనున్న వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాంబొట్ల దేవాలయం, వినాయక ఘాట్‌లను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. నిమజ్జనం రోజు విధుల్లో అలసత్వం పనికిరాదని 32 గంటల పాటు షిఫ్టుల వారిగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్యాధికారి డా.వి. విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీఈఈ నరేష్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ షబ్రీష్, ఏఈలు జనార్దన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, మల్లికార్జున, వలి పాల్గొన్నారు.

అధికారులకు

షోకాజ్ నోటీసులు

● ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం
● వెల్దుర్తి, క్రిష్ణగిరి, ఓర్వకల్లు మండలాలు వెనుకంజ
● కలెక్టర్ పి. రంజిత్ బాషా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు (కలెక్టరేట్), సెప్టెంబరు 11: హౌసింగ్ ద్వారా ఉపాధి హామీ కింద 90 రోజులు పనిదినాలు కల్పించడంలో తుగ్గలి మండలం గత వారంలో జీరో ఉందని, సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ, హౌసింగ్ తదితర శాఖల అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు క్లస్టర్‌లో క్రిష్ణగిరి, వెల్దుర్తి, కర్నూలు, ఓర్వకల్లు మండలాల్లో ఉపాధి పనులు కల్పించడంలో పురోగతి సాధించేలా ఎంపీడీవోలతో సమీక్ష చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల కల్పనలో కర్నూలు జిల్లా రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలోనే ఉందన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి అక్టోబరు 2వ తేదీ నాటికి అన్ని కేంద్రాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వారానికి మూడుసార్లు గ్రామాలకు వెళ్లాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖలో గోకులం షెడ్ల ఏర్పాటుకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను ఎంపీడీవోలకు అందజేయాలని జేడీని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ బుధవారం తెలిపారు. అభ్యర్థులు స్వయంగా ఇంటర్నెట్, మీసేవా, ఏపీ ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్లు ఫొటోస్టాట్ కాపీలను ఎంపిక చేసుకున్న స్టడీ సెంటరులో అందజేయాలని సూచించారు.

తుంగభద్రపై

బిడ్జి కమ్ బ్యారేజీ

సన్నాహాలు ఆరంభించిన కర్ణాటక ప్రభుత్వం

చికలపర్వి-కుంబళనూరు మధ్య ఒకటి, చిన్నమంచాల-మంత్రాలయం వద్ద రెండోది

రెండింటి సామర్థ్యం 0.66 టీఎంసీలు


కర్నూలు ఎంపీ, ఇరిగేషన్ అధికారులతో కర్ణాటక మంత్రి భేటీ

ఈ బ్యారేజీలు నిర్మిస్తే కేసీ కెనాల్ ఆయకట్టుపై తీవ్ర ప్రభావం

రాయలసీమ సాగునీటి నిపుణుల ఆందోళన


కర్నూలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక మైనర్ ఇరిగేషన్ మంత్రి బోసరాజు

కర్నూలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయంలో పూడిక చేరడం వల్ల 35 టీఎంసీలు సామర్థ్యం తగ్గిపోయింది.. ఆ నీటిని వినియోగించుకోడానికి మాన్వి తాలుకా నవలి వద్ద భారీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదించిన కర్ణాటక ప్రభుత్వం తాజాగా తుంగభద్ర నదిపై తాగునీటి పేరిట రెండు బిడ్జి కమ్ బ్యారేజీల నిర్మాణాల కోసం సన్నాహాలు చేస్తుంది. ఇప్పటికే కర్ణాటక రాయచూరు జిల్లా చిన్నమంచాల, కర్నూలు జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం కలుపుతూ తుంగభద్ర నదిపై 0.31 టీఎంసీల సామర్థ్యంలో చిన్నమంచాల బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి రూ.350 కోట్లతో అనుమతులు కూడా ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం వద్ద ఇది పెండింగులో ఉంది. తాజాగా రాయచూరు జిల్లా మాన్వి తాలుకా చికలపర్వి గ్రామం, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంబళనూరు గ్రామాలను కలుపుతూ తుంగభద్ర నదిపై చికలపర్వి-కుంబళూరు బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తుంగభద్ర నది ప్రవహిస్తుండడంతో నదిపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా.. అంతర్ రాష్ట్ర జల సమస్యలు తలెత్తకుండా మిగిలిన రాష్ట్రాలు కూడా ఆమోదం తెలపాల్సి ఉంటుందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఏమాత్రం సంప్రదించకుండా కర్ణాటక మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలు ఆమోదం తెలపడమే కాకుండా పరిపాలన, సాంకేతిక అనుమతులు, అవసరమైన నిధులు మంజూరు చేసిందని తెలుస్తుంది. ఏపీ ఆమోదం లేకుండా బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే మధ్యలోనే పనులు ఆగిపోతాయని గ్రహించిన కర్ణాటక.. ఏపీ ప్రభుత్వం సహకారం కోసం బుధవారం కర్నూలు నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో కర్ణాటక మైనర్ ఇగిరేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి బోసరాజ్ కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు భేటీ అయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా, జలవనరుల శాఖ ఎస్‌ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఈఈ శైలేశ్వర్, కేసీ కెనాల్ డీఈఈ రఘురామిరెడ్డి సహా రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్, మంత్రాలయం టీడీపీ సీనియర్ నేత ఎన్. రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు. చికలపర్వి, చిన్నమంచాల బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణాలు వల్ల కర్ణాటకలో సిరిగుప్ప, మాన్వి, సింధనూరు, మాన్వి తాలుకాల్లో 42 నదీతీర గ్రామాలు, ఏపీలో కర్నూలు జిల్లా కౌతాళం మండలంలో 19 నదీతీర గ్రామాల్లో తాగునీటి సమస్య తీరడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని కర్ణాటక మంత్రి బోసరాజు వివరించారు. 0.35 టీఎంసీలు సామర్థ్యంలో నిర్మించే చికలపర్వి బిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణం కోసం రూ.397.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే.. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి హైడ్రాలజికల్ వివరాలు, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) ఇస్తే వాటిని అధ్యయనం చేసి ఏపీ ప్రభుత్వానికి పంపుతామని, ఆమోదం తెలపాలా వద్దా అన్నది ప్రభుత్వం పరిధిలోని అంశమని, అంతకు మించి తాము దానిపై చర్చించలేమని జలవనరుల శాఖ అధికారులు తేల్చిచెప్పారు.



కేసీ కెనాల్ ఆయకట్టుపై తీవ్ర ప్రభావం

సుంకేసుల బ్యారేజీకి అనుబంధంగా నిర్మించిన కర్నూలు-కడప (కేసీ) కాలువ కింద కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కర్నూలు నగరం సహా పలు గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-1 ఈ కాలువకు 31.90 టీఎంసీలు నికర జలాలు వాటాను కేటాయించింది. అందులో 10 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి తీసుకోవాలి. మిగిలిన 21.90 టీఎంసీల మేర నీటిని నదీప్రవాహం ద్వారా తీసుకోవాల్సి ఉంది. తుంగభద్రకు వరద రోజులు తగ్గిపోవడంతో ఇప్పటికే కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. తుంగభద్ర డ్యాం నుంచి నది ద్వారా తీసుకోవాల్సిన 10 టీఎంసీల వాటాలో భాగంగా ఇంజనీర్లు ఇచ్చే ఇండెంట్ మేరకు విడుదల చేస్తే.. సుంకేసుల బ్యారేజీకి 40-50 శాతం కూడా చేరడం లేదు. అంటే.. ఒక టీఎంసీ కేసీ వాటా విడుదల చేస్తే సంసుకేల బ్యారేజీకి చేరేది కేవలం 0.40 - 0.50 టీఎంసీలకు మించదని అంటున్నారు. కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన చికలపర్వి, చిన్నమంచాల బిడ్జి కమ్ బ్యారేజీలు నిర్మాణం చేస్తే.. ఆ బ్యారేజీలను దాటి కేసీ కెనాల్ వాటా నీరు సుంకేసుల బ్యారేజీకి చేరడం ప్రశ్నార్థకమే. అదే జరిగితే ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రాయలసీమ సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాండా ఈ బ్యారేజీల నిర్మాణాలపై పలు సందేహాలు ఉన్నాయని, వాటి హైడ్రాలజికల్ వివరాలు, డీపీఆర్ అధ్యయనం చేసిన తరువాతే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

వరద బాధితులకు టీడీపీ చేయూత

● కిట్ల పంపిణీలో మంత్రి భరత్, ఎమ్మెల్యేలు ● చంద్రబాబు ఆదేశాలతో ఇంటింటికీ వెళ్లిన నాయకులు



నిత్యావసర వస్తువుల కిట్‌ను మోసుకెళ్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ చొరవచూపింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో పాటు ఎమ్మెల్యేలు, కీలక నాయకులు, కార్యకర్తలు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టారు. సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునివ్వడంతో రూ.కోటి విలువైన నిత్యావసర సరుకులను కర్నూలు నుంచి ఆరు లారీల్లో తీసుకెళ్లి వరద ప్రాంతాల్లోని బాధితులకు స్వయంగా అందజేశారు. విజయవాడ నగరంలోని ఊర్మిలా నగర్, జోజినగర్, బాంబేనగర్, సుబ్బారావు వీధి, గొల్లపూడి, వైఎస్సార్ కాలనీల్లో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, గౌరుచరిత, శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిలు టీడీపీ నేతలతో కలసి వరద బాధితులకు నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడని తెలిపారు. వరద బాధితుల కోసం రూ.కోటి విలువైన 8 వేల కిట్లను పంపిణీ చేశామన్నారు. విజయవాడలో వరదలు రావడం బాధాకరమని, ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు రాత్రి, పగలు వారికి సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుత నాయకులు ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ నాయకులు వరద బాధితులకు చేసిన సహాయం ఏమీ లేదన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప ఏ ఒక్క బాధితుడికి ఎలాంటి సహాయం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్, ఆలూరు నేత వీరభద్రగౌడ్, నంద్యాల నాగేంద్ర, కార్పొరేటర్ పరమేష్, హనుమంతరావు చౌదరి, షేక్షావలి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కిట్‌ను మోసుకెళ్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



విజయవాడలో వరద బాధితులకు జిల్లా నాయకులతో కలిసి కిట్లు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్



సరుకులను అందజేస్తున్న టీడీపీ నేత వీరభద్ర గౌడ్



విజయవాడలోని గొల్లపుడిలో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డివైడర్‌ను ఢీకొన్న కారు..

శిరివెళ్ల, సెప్టెంబరు 11 : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై గోవిందపల్లె సమీపంలోని గణేష్ గోడౌన్స్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన సూర్య(35) అనే వ్యక్తి మృతి చెందాడు. కడప వైపు నుంచి నంద్యాల వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి కుడివైపు డివైడర్‌ను ఢీకొట్టడంతో కారుబోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సూర్య తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందగా అందులోని గణేష్ నిత్య గాయాలపాలయ్యారు. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ విష్ణు కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య బుధవారం తెలిపార

14న సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీన సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల సాధన ప్రాంతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ కో చైర్మన్ మహ్మద్ రఫీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్‌పాలసీ రెగ్యులరైజేషన్ సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సమ్మె కాలానికి జీతం చెల్లింపు వంటి సమస్యలను చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ కాంతారావు నానీ హాజరవుతున్నారని అన్నారు. ఈ నెల 14న శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సమగ్ర శిక్ష ప్రాజెక్టులో ఎంఈవో కార్యాలయ సిబ్బంది, భవిత సిబ్బంది, హై స్కూల్, అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో పని చేస్తున్న పార్ట్ టైమ్ టీచర్లు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, జిల్లా ఆఫీసు స్టాఫ్, ఇంజనీరింగ్ సిబ్బంది అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా సలహాదారులు బాబు, అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ.11 లక్షల విరాళం

● లోకేశ్‌కు కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 11: వరద బాధితులకు కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత, తెలుగుదేశం పార్టీ నాయకుడు కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షల విరాళం అందజేశారు. బుధవారం విజయవాడలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి మంత్రి నారా లోకేశ్‌కు ఆయన చెక్కును అందజేశారు.



లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత

బొల్లవానిపల్లెలో వజ్రం లభ్యం

తుగ్గలి, సెప్టెంబరు 11: పొలం పనులు చేసుకుంటున్న వ్యవసాయ కూలికి విలువైన వజ్రం లభ్యమైంది. బుధవారం మండల పరిధిలోని బొల్లవానిపల్లెకి చెందిన వ్యవసాయ కూలీకి వజ్రం దొరకడంతో దానిని జొన్నగిరికి చెందిన వజ్రాల వ్యాపారస్థుడు రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసిన సమయంలో ఈ ప్రాంతంలో వజ్రాలు దొరుకుతూ ఉంటాయి. తాజాగా వజ్రం లభించడంతో వ్యవసాయ కూలి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి నోటిఫికేషన్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 11: డిగ్రీ 2015-16,17,18 విద్యా సంవత్సరంలో చేరి కోర్సు పూర్తి చేసుకోలేని వారికి ఒక అవకాశం కల్పిస్తున్నామని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. పైన పేర్కొన్న సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు ఏ సెమిస్టర్‌లో ఫెయిల్ అయిన సబ్జెక్టుకైనా దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేశామని పేర్కొన్నారు. నవంబర్ 5వ తేదీ లోపు ఆయా కళాశాల్లో ఫీజులు చెల్లించి, మిగిలిన వివరాల కోసం నోటిఫికేష్ పరిశీలించాలని పేర్కొన్నారు.

నాన్న మా అమ్మను కొడుతున్నాడు..

పోలీసులకు ఫిర్యాదు చేసిన 10 ఏళ్ల బాలిక

అఖిలను అభినందించిన సీఐ జయన్న

పత్తికొండ, సెప్టెంబరు 12 : బుధవారం సాయంత్రం 4:40 సమయం. పదకొండేళ్ల బాలిక అఖిల బిక్కుబిక్కుమంటూ పత్తికొండ స్టేషన్ ఆవరణలోకి వచ్చింది. సెంట్రీ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఏం కావాలమ్మా అంటూ బాలికను ప్రశ్నించాడు. మా నాన్న తాగివచ్చి అమ్మను కొడుతున్నాడు అని బాలిక చెప్పింది. సెంట్రీ బాలికను సీఐ జయన్న వద్దకు తీసుకెళ్లారు. సీఐతో కూడా బాలిక ధైర్యంగా సమస్య చెప్పింది. ఆయన స్పందించి వెంటనే కానిస్టేబుల్‌ను బాలిక వెంట వారి ఇంటికి పంపించారు. బాలిక తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అఖిలను సీఐ అబినందించారు. కాగా బాలిక పత్తికొండ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది.



సీఐ జయన్నకు ఫిర్యాదు చేస్తున్న బాలిక అఖిల

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 11: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన ఈడిగ రవిచంద్రపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ రఫీ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన గంగపోగు రాజగోపాల్ ఇంటి ముందు, రవిచంద్ర తన హోటల్‌లోని వ్యర్థపు నీరు, చెత్తను వేస్తున్నాడన్నారు. ఇంటి ముందు నీరు చెత్త వేయవద్దని ప్రశ్నించినందుకు రాజగోపాల్‌ను కులం పేరుతో దూసిస్తూ, కాళ్లు, చేతులతో రవిచంద్ర తన్నినట్లు ఫిర్యాదు చేశాడన్నారు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసపినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చిన్నారిని దిగమింగిన పైప్ లైన్ గుంత

● అధికారులు తవ్వి వదిలేశారు

● కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు, బంధువులు



కుమారుడు గౌతమ్‌ను ఎత్తుకున్ని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు



రుద్రవరం, సెప్టెంబరు 11 : సూర్యోదయాన తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లారు. పిల్లలను ఇంటి వద్దనే జేజినాయన వెంకటేశ్వర్లు సమక్షంలో వదిలారు. పైపులైను కోసం తీసిన గుంతలో ఐదేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి పడిపోయాడు. ఈ విషాదం బుధవారం మధ్యాహ్నం ఆ ఐదేళ్ల చిన్నారి గౌతంకు మృత్యువుగా కబళించింది. ఈ సంఘటన రుద్రవరం మండలం చందలూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుబ్బయ్య, మహేశ్వరి దంపతులకు ఐదేళ్ల చిన్నారి గౌతం, మరో కుమార్తె ఉన్నారు. వీరు వ్యవసాయ కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. బుధవారం ఉదయం పొలం పనులకు వెళుతూ పిల్లలను జేజినాయన వెంకటేశ్వర్లు వద్ద వదిలి వెళ్లారు. ఈ మధ్య అధికారులు పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో బాలుడు గౌతం పడిపోయాడు. గౌతం ఎంత సేపటికి కనిపించకపోయేసరికి జేజినాన వెంకటేశ్వర్లు పైప్ లైన్ గుంతలో వెతికాడు. ఇతరుల సాయంతో బాలుడ్ని అందులోంచి బైటికి తీశాడు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. తల్లిదండ్రులు సుబ్బయ్య, మహేశ్వరి హుటాహుటిన ఇంటికి వచ్చి చనిపోయిన కుమారుడ్ని చూసి విలపించారు. పొద్దున పొలం పనులకు వెళుతున్నప్పుడు కొడుకు టాటా చెప్పాడని, అంతలోనే విగత జీవి అయ్యాడని రోదించారు.

అధికారుల నిర్లక్ష్యం

సర్పంచ్ పుల్లమ్మ ఆధ్వర్యంలో ఎన్నికల ముందు అధికారులు పైపులైను కోసం గుంత తవ్వి వదిలివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంత నిండా నీరు చేరింది. పైపులైను ఏర్పాటు చేసి పూడ్చి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు వాపోయారు. కాగా తాను విధుల్లో చేరకముందే ఈ గుంత తవ్వారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి పూడ్చిస్తామని చందలూరు పంచాయతీ కార్యదర్శి మౌనిక అన్నారు. ఇక్కడ గుంత తవ్వడానికి అనుమతి లేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రమోద్ అన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి ఫకృద్దీన్ మృతదేహాన్ని పరిశీలించారు.

శ్రీమఠంలో ఆభరణాల తనిఖీ

● గత 30 ఏళ్లుగా లెక్కించనివి కూడా..

● 18 మఠాల ఆభరణాల లెక్కింపు పూర్తి

మంత్రాలయం, సెప్టెంబరు 11: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం చరిత్రలో ఎప్పుడు లెక్కించని బంగారు, వెండి ఆభరణాలను పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు లెక్కించి రికార్డు చేసేందుకు శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లా జేవీవో పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి ఈ పనిని పర్యవేక్షిస్తున్నారు. మంత్రాలయం ప్రధాన కేంద్రంగా మరో 35 బ్రాంచ్ మఠాల్లో బంగారం, వెండి ఆభరణాలపై లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మంత్రాలయంతో పాటు 18 మఠాల్లో ఈ పని పూర్తి కాగా, మరో 12 మఠాలను లెక్కించాల్సి ఉందని జిల్లా దేవదాయశాఖ బంగారు, వెండి తనిఖీ అధికారి పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో కలిసి ఇంత వరకు మఠాల్లో పర్యటించి లెక్కించిన ఆభరణాల వివరాలపై మాట్లాడారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం, సోలాపూర్, తిరుపతి, హైదరాబాదు బర్కత్‌పూర్, గద్వాల, మహబూబ్ నగర్, ముంబైలోని రెండు మఠాలు, తుంగభద్ర, కదిరి, తాడిపత్రి, ఆదోని మఠాలు పూర్తయినట్లు తెలిపారు. లెక్కించాల్సినవి గోవా, డిల్లీ, కొల్హాపూర్, ధర్మవరం, పెనుగొండ, హైదరాబాద్ మల్కాజ్‌గిరి, ఉరవకొండ, రాయచోటి వంటి మఠం బ్రాంచులను తనిఖీ చేయాల్సి ఉందన్నారు. పాండురంగారెడ్డికి పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. మఠం దివాన్ సధీంద్ర ఆచార్, గౌతమ్, ఆచార్, ఆనందతీర్థాచార్, శ్రీపతిఆచార్ పాల్గొన్నారు.



పీఠాధిపతులతో మాట్లాడుతున్న జీవీవో పాండురంగారెడ్డి, ఏఏవో మాధవశెట్టి

ఎదురు చూపులే..!

● వేతనాల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగుల అగచాట్లు

● బడ్జెట్ వస్తేనే వేతనాలు

● కూటమి ప్రభుత్వంలో కూడా తప్పని కష్టాలు



ఆలూరు, సెప్టెంబరు 11: ప్రభుత్వాలు మారినా సమగ్ర శిక్ష ఉద్యోగుల కష్టాలు మాత్రం గట్టెక్కడం లేదు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీ రాగానే వేతనాలు అందుతున్నా సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం ప్రతి నెల వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసి సంబంధిత శాఖల హెచ్ఓడీల ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు జమచేస్తూ.. ఔట్ సర్సింగ్ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) ద్వారా వేతనాలు ప్రతి నెల 1వ తేదీ వేతనాలు జమ అవుతున్నాయి. అయితే సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న వారికి మాత్రం బడ్జెట్ రెండు, మూడు నెలలకు ఒక్కసారి విడుదల అవుతోంది. దీంతో రెండు నెలలకు లేదంటే 3 నెలలకు ఒక్కసారి వేతనాలు జమ చేస్తున్నారు. దీంతో జిల్లాలో ఆ శాఖ పరిధిలోని ఉన్న కేజీబీవీ అర్బీలు, మోడల్ హాస్టల్ వార్డెన్లు, వంట చేసేవారు, వాచ్‌మన్లు, మెసెంజర్లు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఈఎస్‌కో ఆర్డినేటరులు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు ఇలా మొత్తం 550 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం కలిపి నిధులు కేటాయిస్తారు. ఒకటో తేదీ వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సక్రమంగా వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు అవే కష్టాలు తప్పడం లేదంటున్నారు చిరుద్యోగులు. వార్షిక బడ్జెట్‌ను విడుదల చేసిన ప్రతి నెల సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.



●వార్షిక బడ్జెట్ విడుదల చేయాలి



అన్ని ప్రభుత్వ శాఖల తరహాలో సమగ్ర శిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేందుకు వార్షిక బడ్జెట్‌ను విడుదల చేయాలి. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ భారంగా మారుతున్నాయి. ప్రభుత్వం దృష్టికి సారించి న్యాయం చేయాలి.

- మహ్మద్ రఫీ, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ

2029లో అధికారంలోకి రావడమే లక్ష్యం

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, సెప్టెంబరు 11: కేంద్ర, రాష్ట్రాల్లో 2029లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ అమలు చేస్తామని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం ఆంధ్రరత్న భవన్‌లో డీసీసీ అధ్యక్షుడిగా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి లక్ష్మీనరసింహ యాదవ్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు షర్మిల ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తూ ప్రజలకు మరింత చేరువై కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానన్నారు. పార్టీలోని అన్ని వర్గాలను కలుపుకొనిపోతానని పేర్కొన్నారు. వరుసగా మూడోసారి డీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతన ఇన్‌చార్జులను ఏడురోజుల్లోనే నియమిస్తామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు.



షర్మిల నుంచి నియామక పత్రం అందుకుంటున్న లక్ష్మీనరసింహ యాదవ్

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి

కర్నూలు, సెప్టెంబరు 11: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 11 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో యు. రామచంద్ర (గోనెగండ్ల పీఎస్), ఎస్.ఈరన్న (గూడూరు పీఎస్), ఈ. గిడ్డయ్య గౌడు (హాలహర్వి పీఎస్), ఎం.శాంతరాజు (ఫ్యాక్షన్ జోన్ అటాచ్డ్ టూ పెద్దకడుబూరు పీఎస్), జి. పాండు రంగ స్వామి (పాణ్యం పీఎస్), వి.సంజీవుడు (బ్రాహ్మణకొట్కూరు పీఎస్), ఎం. సిఖిందర్ మిర్జా (కర్నూలు టూటౌన్ పీఎస్), వి. శ్రీనివాసరాజు (రుద్రవరం పీఎస్), ఏ. బాలరాజు (డీఎస్‌బీ, కర్నూలు), కె. వెంకటేశ్వర చౌదరి (పెద్దతుంబళం పీఎస్), పి.హరినాథ్ బాబు (ఆదోని తాలుకా పీఎస్)లు ఉన్నారు.

రవాణా శాఖ కార్యాలయం ముట్టడి

కర్నూలు, సెప్టెంబరు 11: డ్రైవింగ్ టెస్టులు, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్న నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీటీసీ కార్యాలయాన్ని ముట్టడించారు ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహనదారులకు పనులు సులభతరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలి తప్ప.. జీవోలు తీసుకువచ్చి ఆర్టీయే కార్యాలయాలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. రాధాకృష్ణ, నాయకులు పి. మహమూద్ రవి, గంగాధర్, షంషేర్ కుమార్, మల్లి, నాగరాజు, నబీ, మాలిక్, శ్రీను, కరుణ, రామమద్దయ్య, సిద్ధయ్య, గంగాధర్ పాల్గొన్నారు.



డీటీసీకి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఆన్‌లైన్ వెబ్‌సైట్ పేరుతో మోసం

కర్నూలు, సెప్టెంబరు 11: నగరంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన ఆదిత్య అనే వ్యక్తి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా మోసపోయానంటూ బుధవారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ వెబ్‌సైట్‌ను క్లిక్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆ వెబ్‌సైట్ నిర్వాహకులు ఆశ చూపారు. ఇందుకోసం కొంత పెట్టుబడి పెట్టాల్సి ఉందన్నారు. వారి మాటలను నమ్మిన ఆదిత్య రూ.11.50 లక్షలను వారి ఖాతాకు బదిలీ చేశాడు. ఆ తర్వాత మరి కొంత పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో మొదట పెట్టిన పెట్టుబడికి లాభాలు ఇవ్వాలని బాధితుడు డిమాండ్ చేశాడు. దీంతో ఆ వెబ్‌సైట్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తాను మోసపోయానని గుర్తించిన ఆదిత్య సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వెబ్‌సైట్ నిర్వాహకుల బ్యాంకు ఖాతాను సీజ్ చేయడంతో రూ.9 లక్షల మేర మిగిలింది. మిగతా మొత్తం అప్పటికే స్వాహ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



రామకృష్ణనగర్‌లో సరస్వతీ రూప విఘ్ననాయకుడు

నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు బుధవారం వినాయక మండపాల్లో బొజ్జ గణపయ్యలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. షరీన్‌నగర్‌లోని సద్గురు త్యాగరాజ రామాలయంలో విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రంలోని 50 మంది విద్యార్థులతో పూజలు చేశారు. వీహెచ్‌పీ మాతృశక్తి జిల్లా కో కన్వీనర్ మాళిగి పావని ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు సిద్ధించేందుకు ఈ పూజలు చేపట్టారు. బుధవారపేట, గాయత్రి ఎస్టేట్, బాలాజీనగర్, బళ్లారి రోడ్డులోని రాజీవ్ గృహకల్ప, రామకృష్ణనగర్, వెంకటరమణ కాలనీ, వన్‌టౌన్‌లోని చిత్తారివీధి, టెలికాం నగర్, చిదంబరరావు వీధి, రామాలయం తదితర ప్రాంతాల్లో గణనాథులు పూజలందుకుంటున్నారు.

- కర్నూలు(కల్చరల్)



రాజీవ్ గృహ కల్ప వద్ద కొలువుదీరిన గణనాథుడు



టెలికాం నగర్‌లో..



బుధవారపేటలో ..



బాలాజీనగర్‌లో..



బుధవారపేటలో పూజలు చేస్తున్న డాక్టర్ సుధాకర్



సద్గురు త్యాగరాజ రామాలయంలో..

ఘనంగా వినాయక నిమజ్జనం



ప్యాలకుర్తిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 11: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. వాహనంపై విగ్రహాలను కొలువుంచి వీధుల గుండా ఊరేగించారు. మండలంలోని అమడగుంట్ల, ప్యాలకుర్తి గ్రామాల్లో ఎస్ఐ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఊరేగింపులో ఎస్ఐ డ్యాన్స్ చేసి యువకులను ఉత్సాహపరిచారు. అనుగొండలో వేలంలో లడ్డూను రూ. 22వేలకు క్రిష్ణ అనే యువకుడు కైవసం చేసుకున్నాడు.

కర్నూలు(ఎడ్యుకేషన్): 29వ వార్డు సొసైటీ కాలనీలో వినాయక మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక భక్త మండలి సభ్యులు వేణుగోపాల్, రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ విభాగం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయాచారి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 11: కోడుమూరు సెబ్ పోలీసులు అక్రమ మద్యం, నాటుసారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం నిర్వహించారు. ఏఈఎస్ వినోద్‌కుమార్ అధ్వర్యంలో 7 వాహనాలను వేలంలో ఉంచగా 6 వాహనాలు కొనుగోలు చేశారని సీఐ రామాంజనేయులు తెలిపారు. దీంతో రూ.91,568 ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని అన్నారు. అలాగే పట్టుకున్న కర్ణాటక, తెలంగాణ మద్యం 54.26 లీటర్లను ధ్వంసం చేశారు. మద్యం విలువ రూ.1,79,070 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ అదనపు టర్నేజ్ వసూళ్లను రద్దు చేయాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 11: లారీల అదనపు టర్నేజ్ వసూళ్లను రద్దు చేయాలని బుధవారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలోని టోల్‌గేటు వద్ద లాంగ్ లోకల్ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నన్నూరు టోల్‌గేటులో అదనంగా రుసుం వసూలు చేస్తున్నారని, ఈ విధంగా వసూళ్లు చేయకూడదని ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి: ప్రత్యేకాధికారి

కల్లూరు, సెప్టెంబరు 11: వందరోజుల ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అధికారులు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి దీప్తి ఆదేశించారు. బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, వెలుగు ఏపీఎం, ఈవోఆర్డీతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఏపీడీ లక్ష్మన్న, వెలుగు ఏపీఎం శ్రీనివాసగౌడ్, ఈఓఆర్డీ రవికిషోర్, హౌసింగ్‌వర్క్‌ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 11: యువత సన్మార్గంలో నడవాలని న్యాయవాది, శ్రీధర్ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. బుధవారం బీ. క్యాంపు క్రీడా మైదానంలో సురేష్ పోలీస్ అకాడమి ఏర్పాటు చేసిన క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేంద్ర, మాజీ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుదర్శన్‌రావు, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథదాసుల ఆరాధన

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 11: నగరంలోని పేట శ్రీరామాలయంలో వాగ్గేయకారుడు జగన్నాథ దాసుల ఆరాధన బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అఖిల భారత మాధ్వమహా మండల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుధా పండితుడు గోవర్ధనాచార్యులు మాట్లాడుతూ సంస్కృత కావ్యాలను ప్రాంతీయ భాషల్లో అనువాదం చేయడం సహజమని, అయితే ప్రాంతీయ భాషలోని కావ్యం, సంస్కృతంలోకి అనువాదం చేసిన గొప్పతనం జగన్నాథదాసుల వారిదని కొనియాడారు. అధ్యక్షులు మాళిగి హన్మేశాచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, జయతీర్థ ఆచార్యులు, గాడిచర్ల ప్రదీప్, ప్రాణేష్, శ్యామ్ పాల్గొన్నారు.

సోలార్ పార్కు పనులను ఆపాలి



కరపత్రాలు పంపిణీ చేసిన రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 11: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పార్కు నిర్మాణ పనులను ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగన్న, మధుసూదన్, మాసూంబాషా, భూ నిర్వాసితుల కమిటీ సభ్యుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పార్కు నిర్మాణ పనులు చేపట్టమని గ్రామస్థులకు, రైతులకు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత సోలార్ పార్కు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేయడం సరైంది కాదని అన్నారు. సోలార్ పార్కు ఏర్పడితే సారవంతమైన భూములు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ప్రభుత్వం స్పందించి సోలార్ పార్కు ఏర్పాటు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, సుబ్బ రాయుడు, హుశేన్, వెంకటరమణ, తిరుపతయ్య, శ్రీరాములు, వేణు గోపాల్, బ్రహ్మాచారి, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చాంద్‌బాషాకు తెలంగాణ సాహిత్య కళాపీఠం పురస్కారం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 11: కర్నూలుకు చెందిన రచయిత డి. చాంద్‌బాషా తెలంగాణ సాహిత్య కళాపీఠం పురస్కారం అందుకున్నారు. మంగళవారం హైదరాబాదులో జరిగిన తెలంగాణ భాషా దినోత్సవం, మహాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య కళాపీఠం వారు అంతర్జాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ పోటీలో చాంద్‌బాషా కవిత అందరినీ అలరింపజేయడంతో ఆయనకు పురస్కారం ప్రకటించారు. కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకురాలు శాంతకుమారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదంలో ఉర్దూ స్కూల్

- శిథిలావస్థలో పాఠశాల భవనం
- పెచ్చులూడి పడుతున్న పై కప్పు
- ఆందోళనలో టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు



మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో పెచ్చులూడి పడిన పై కప్పు

కల్లూరు, సెప్టెంబరు 11: కల్లూరు అర్బన్ పరిధిలోని 30వ వార్డు రాఘవేంద్రనగర్‌లో మున్సిపల్ ఉర్దూ స్కూల్‌కు ప్రమాదం పొంచి ఉంది. వర్షాలు పడుతుండటం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నగరంలో కురుస్తున్న వర్షాలకు పాఠశాల భవనం పెచ్చులూడి వంటశాలలోని ఫ్లోరింగ్ కూలిపోతుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులకు పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, విద్యాశాఖ అధికారులు స్పందించి మున్సిపల్ ఉర్దూ స్కూల్‌ను మరో చోటుకి మార్పు చేయాలని కోరుతున్నారు.

● **అధికారుల దృష్టికి సమస్య** రాఘవేంద్రానగర్‌లోని మున్సిపల్ స్కూల్ సమస్యను కలెక్టర్, నగరపాలక సంస్థ, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ప్రధానోపాధ్యాయురాలు పి.రహీఖాతూన్ తెలిపారు. నగరంలోని గడ్డావీధిలో ఉండే మున్సిపల్ ఉర్దూ స్కూల్ భవనం బాగోలేక అప్పటి కమిషనర్ రవీంద్రబాబు రాఘవేంద్రానగర్‌కి బదిలీ చేశారన్నారు. అప్పటి నుంచి ఓ భవనంలో ఉచితంగా పిల్లలకు పాఠాలు చెపుతున్నామని వివరించారు. ప్రస్తుతం ఇక్కడ కూడా స్కూల్ భవనం శిథిలావస్థకు చేరడంతో పిల్లలకు భద్రత కొరవడిందని అన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 58 మంది పిల్లలు చదువుకుంటున్నారని, రెండు గదుల్లో పాఠాలు బోధిస్తూ, వంట కూడా ఇక్కడే వండుతున్నట్లు తెలిపారు. పాఠశాల భవనం పెచ్చులూడి పడుతుండటంతో భయంగా ఉందని అధికారులు స్పందించి పాఠశాలను ఇక్కడి నుంచి మార్పు చేయాలని కోరారు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీ అయ్యారు. కమిషనర్ రాగానే సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. జిల్లా విద్యాశాఖ అధికారులకు విషయం తెలిపి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

- విజయకుమారి, కర్నూలు అర్బన్ ఎంఈఓ

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మెప్మా ఏఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 11: మెప్మా రీసోర్స్ పర్సన్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం మెప్మా కార్యాలయంలో పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ జీతాలు రాకపోవడంతో ఆర్పీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.రుద్ర మ్మ, ఎస్.షబానా, సుజాత, శ్రీదేవి, రాజేశ్వరి, ఖైరున్, స్వాతి, మంజుల పాల్గొన్నారు.

జీవో 21ని రద్దు చేయాలి: సీఐటీయూ

గూడూరు సెప్టెంబరు 11: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు యాక్టు సవరణ చట్టం జీవో నెంబర్ 21ని రద్దు చేయా లని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు పట్టణంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్, ఆటో వర్కర్స్ యూనియన్ మండల నాయకుడు రాజు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆటో కార్మికులు కరోనాతో పెట్రోల్, డీజిల్, జీఎస్టీ ధరలు పెరగడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారిపై మోటారు యాక్టు సవరణ చట్టం తెచ్చి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, గంగన్న, సుందర్ రాజు, అంజి, మహేష్ రవి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్, సెప్టెంబరు 11: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండలంలోని బురాన్‌దొడ్డి, కంబంధహల్, కొండాపురం గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్లను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా నిర్మించుకోవాలన్నారు. ఏఈ వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లబ్ధిదారులు ఉన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు

గూడూరు సెప్టెంబరు 11: గూడూరు తూర్పు బీసీ కాలనీలో పౌష్టికాహార వారోత్సవాలు బుధవారం మెప్మా అధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సూర్య నారాయణ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలు ఇచ్చే పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు శాంతి, ఐసీడీఎస్ సిబ్బంది లక్ష్మీ, ఆశా కార్యకర్త శేషమ్మ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 11: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన అంతర్ పాఠశాలల హ్యాండ్ బాల్ పోటీలను సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి బొల్లవరం రామాంజనేయులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్, క్రీడా సంఘాల ప్రతినిధులు చిన్న సుంకన్న, శ్రీను, సుభాన్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న మెప్మా అధికారులు, సిబ్బంది

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 11: వరద బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఉమ్మడి కర్నూలు జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా పీడీ నాగశివలీల, మెప్మా కార్యాలయ సిబ్బంది తరఫున విరాళంగా రూ.13,80,100 చెక్కును కలెక్టర్ రంజిత్‌బాషాకు అందజేశారు. సీఎం సహాయ నిధికి చెక్కును అందజేసిన వారిని కలెక్టర్ అభినందించారు. టీపీఆర్వో వెంకటలక్ష్మి, ఏవో మాసూంబాషా, మురళి పాల్గొన్నారు.

● సీఎం సహాయ నిధికి బెంగళూరు వహీద్ గ్రూపు ఎఫ్ఎం డెవలప్మెంట్ సొసైటీ వైస్ ప్రెసిడెంటు షేక్ వహీద్ రూ.50వేల చెక్కును కలెక్టర్ పి.రంజిత్ బాషాకు అందజేశారు.

కర్నూలు(న్యూసిటీ): ఆల్ ఇండియా బీఎస్ ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ కేంద్ర శాఖ ఢిల్లీ, ఏపీ విజయవాడ శాఖల విజ్ఞప్తి మేరకు ఉద్యోగుల నుంచి సేకరించిన విరాళాలను రాష్ట్ర కార్యదర్శికి అందజేశామన్నారు.

జూనియర్ డాక్టర్ల వసతి ఏర్పాట్ల పరిశీలన

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 11: క్యాజువాల్టీ విభాగంలో పనిచేసే జూనియర్ డాక్టర్ల వసతి ఏర్పాట్లను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ బుధవారం పరిశీలించారు. మహిళా జూనియర్ డాక్టర్లకు నాలుగు బెడ్లు, పురుష డాక్టర్లకు నాలుగు బెడ్లు ఉండే వేర్వేరు గదుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలకు క్యాజువాల్టీ దగ్గరలో ఉండేలా చూడాలని ఏఆర్ఎంవో డా.వెంకటరమణను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్టు మెంటు హెచ్‌వోడీ డాక్టర్ రామశివ నాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కోసం బుధవారం జిల్లాలోని 8, 9, 11 తరగతుల విద్యార్థులకు రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నగరంలో ఇందిరాగాంధీ మున్సిపల్ హై స్కూల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో ఇద్దరు విద్యార్థులతో కూడిన 10 టీములు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు లికిత, ప్రీతీష్ మొదటి స్థానంలో నిలువగా, రెండో స్థానంలో ఇందిరాగాంధీ మెటీరియల్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు వేదవతి, విజయలక్ష్మి నిలిచారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సిబ్బంది శంకర్‌గౌడు, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, చైల్డ్ ఫండ్ ఇండియా నాగరాజు, చక్రవర్తి, విజయ మహిళా మండలి సంస్థ ప్రతినిధి శివకుమార్ పాల్గొన్నారు.

పని వేళలు పాటించకపోతే చర్యలు

సి.బెళగల్, సెప్టెంబరు 11: పని వేళలు పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో భాస్కర్ హెచ్చరించారు. బుధవారం సి.బెళగల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారులు మిథున్ కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

బాధ్యతతో పనిచేయాలి: ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతతో పని చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్యామల అన్నారు. బుధవారం సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాముడు, ఈవోఆర్డీ సందీప్, ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం: గౌరు చరిత



విజయవాడ పరిధిలోని గొల్లపుడిలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కల్లూరు, సెప్టెంబరు 11: గొల్లపూడి వరద ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గొల్లపూడి ఇన్‌చార్జి గౌరు చరిత బుధవారం సాయిపురం కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదలతో దెబ్బతిన్న పరిశ్రమల్లోని యంత్రాలను ఆమె పరిశీలించారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన పరిహారంపై నివేదిక రూపొందిస్తున్నామన్నారు. అర్హులైన వారందరికీ నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని పరిశ్రమల యాజమాన్యానికి హామీ ఇచ్చారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్ల పంపిణీ



నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 11: విజయవాడలో వరద బాధితులకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తన వంతు సహాయార్థం కోసం బుధవారం ఎమ్మెల్యే దస్తగిరి తన నియోజకవర్గం నుంచి బియ్యం, కందిపప్పు, నూనె, సబ్బులు దాదాపు 500 నిత్యావసర కిట్లను విజ యవాడకు తీసుకెళ్లారు. విజయవాడలోని 45వ డివిజన్ పరిధిలో ఊర్మిళనగర్, జోజినగర్‌ల్లో వరద బాధితులకు నిత్యావసర కిట్లు అందజేశారు. ఆయన వెంట కోడుమూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు విక్రమ్, మౌలాలి, వినోద్ గౌడ్, స్థానిక నాయకులు రవణమ్మ, సత్యనారాయణ, సుభాని పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కల్లూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ సీనియర్ నాయకులు ఈవీ రమణ, రంగస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఉలిందకొండ గ్రామంలో బుధవారం విరాళాలు సేకరించారు. మొదటి రోజు దాదాపు రూ.లక్ష వసూలు అయినట్లు వారు తెలిపారు. విరాళాల సేకరణ అనంతరం వచ్చిన మొత్తాన్ని గౌరు దంపతులకు అందజేసి సీఎం చంద్ర బాబుకు చేరవేయనున్నట్లు టీడీపీ నాయకుడు ఈవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో యుద్ధం శ్రీనివాసులు, బి.సుబ్బరాయుడు, బి.వేంకటేశ్వర్లు, శివ, సుధాకర్, వెంకటకృష్ణ, నారాయణ, మద్దయ్య, శ్రీకాంత్, విక్రమ్, సీవీ రమణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏపీజీఈఏ సాయం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులకు కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఆపన్న హస్తం అంది స్తోంది. వరదల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలకు సాయం చేకూరేలా నిత్యావసర సరుకుల కిట్లు విజయవాడకు తీసుకెళ్తున్న వాహనాన్ని కర్నూలు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. గురువారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీకేఆర్ సూర్యనారాయణ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం చేపడతామని జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ తెలిపారు. జిల్లా సెక్రటరీ సురేష్ రెడ్డి, సిటీ అధ్యక్షుడు మురళీధర్ నాయుడు, సిటీ సెక్రటరీ చెన్నకృష్ణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, సెప్టెంబరు 11: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం సి. బెళగల్‌లోని ఎరువులు, విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మల్లేష్‌కుమార్ మాట్లా డుతూ దుకాణ యజమానులు రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాల బిల్లులను అందజేయాలని, స్టాక్ వివరాలను నోటీసు బోర్డులో నమోదు చేయాలని అన్నారు. ఏవో వెంట ఎంపీఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



రోడ్డుపై పడిన గుంతలు

కోడుమూరు, సెప్టెంబరు 11: పట్టణంలోని రామన్ పబ్లిక్ స్కూల్ ముందు ఉన్న ఎమ్మిగనూరు వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. అటు వైపు వెళ్తున్న వాహనాలు పట్టు తప్పితే అంతే సంగతులు. ఇటు వైపుగా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కర్ణాటక రాష్ట్రానికి అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. అయితే గత రెండు నెలలుగా రోడ్డుపై మోకాళ్లలోతు గుంతలు పడ్డాయి. అతి వేగంతో వచ్చే మోటర్ సైకిళ్లు గుంతలో పడి అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయం ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఆలూరు, సెప్టెంబరు 11: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌రావు గురువారం తెలిపారు. బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ జువాలజీ గ్రూపులు ఉన్నాయని ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

గంగమ్మ ఒడికి...




తొలి గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు

ఆదోని/ఆదోని(అగ్రికల్చర్), సెప్టెంబరు 11: అయిదు రోజులపాటు పూజలు అందుకున్న గణనాధుడు గంగమ్మ ఒడికి చేరారు. బుధవారం ఆదోని శివార్లలోని హరివాణం తుంగభద్ర దిగువ కాలువలో భక్తులు నిమజ్జనం చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప పూజలు చేశారు. వినాయక మిత్ర మండలి సభ్యులు ఎగ్గాటి ప్రతాప్, కునిగిరి నీలకంఠ, విట్టా రమేష్, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్, శ్రీనివాసాచారి, దేవిశెట్టి ప్రకాష్‌తో కలిసి ఎమ్మెల్యే డా. పార్థసారథి, మున్సిపల్ ఛైర్ పర్సన్ బోయ శాంత, గుడిసె కృష్ణమ్మ, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పాల్గొన్నారు. లడ్డూను వేలం వేయగా రూ.1.75 లక్షకు మహేంద్ర రెడ్డి దక్కించుకున్నారు. వినాయక మండపం వద్ద హుండీని రూ.2.10 లక్షలకు డా.విజయ్ దక్కించుకున్నారు.

సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర

బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి నిమజ్జనానికి తరలించారు. అధిక శాతం చీకటి పడ్డాక విగ్రహాలను వాహనాల ద్వారా నిర్వాహకులు డీజేలతో తరలించారు. రాత్రి 10 గంటలకు సగంకూడా పూర్తికాలేదు.











లడ్డూ తెస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి



నృత్యం చేస్తున్న మహిళలు



నిమజ్జనం వద్ద వైద్య శిబిరం

కోసిగిలో నిమజ్జన వేడుకలు

కోసిగి, సెప్టెంబరు 11: మండల కేంద్రంలో బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం మాధవరం వద్ద గల తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. కోసిగయ్య గుడిలో గణేషునికి ప్రత్యేక పూజలు చేసి లడ్డూ ప్రసాదాల వేలాలు నిర్వహించారు. వినాయక మండపాల నిర్వహకులు, అర్చకులు శ్రీరాములు, హనుమేష్, ఈరన్న, హనుమంతు, కర్రయ్య, మల్లికార్జున పూజలు చేశారు. మహారాష్ట్ర కళాకారులచేత నృత్యప్రదర్శ నలు, డప్పు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ బందోబస్తు నిర్వహించారు.

మంత్రాలయం: మండలంలోని తుంగభద్ర, కాచాపురం, రాంపురం గ్రామాల్లో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనం చేశారు. ఎస్ఐ విజయకుమార్ బందోబస్తు నిర్వహించారు.



నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు



కోసిగిలో మహారాష్ట్ర సోలాపూర్ కళాకారుల ప్రదర్శన

హుండీ పగులగొట్టి డబ్బులు తీసుకెళ్లారు

హొళగుంద, సెప్టెంబరు 11: దేవరగట్టు మాళమల్లేశ్వర ఆలయంలో రెండు హుండీల తాళాలు పగలగొట్టి దుండగులు డబ్బులు తీసుకెళ్లినట్లు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కమిటీ, అధికారులకు సమాచారమివ్వ కుండా లక్షల రూపాయలు తీసుకువెళ్లడంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మరో రెండు హుండీలను గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం సమక్షంలో లెక్కించారు. రూ.2.60 లక్షల నగదు, ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు. వీర నాగప్ప, రాము నాయక్, మల్లయ్య, శేఖన్న, రామయ్య పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న నిర్వాహకులు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి వారిని బుధవారం ఆయన దర్శించుకున్నారు.

టీబీ డ్యామ్‌కు నూతన గేట్లు ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే

ఆలూరు, సెప్టెంబరు 11: తుంగభద్ర డ్యాంకు నూతన గేట్లు అమర్చాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ నెల క్రితం గేటు కొట్టుకు పోయి, 32 టీఎంసీల నీరు వృథాగా పోయిందని, రైతులు నష్టపోయారన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అరికెర వెంకటేశ్వర్లు, వీరేష్, నాగేంద్ర, మల్లి, గిరి, శివ, మాదన్న, వరుణ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే బీ విరుపాక్షి

ఎల్లెల్సీ నీరు జీడీపీకి

గోనెగండ్ల, సెప్టెంబరు 11: ఎల్లెల్సీ సెక్షన్ పరిధిలోని ఎస్కేప్ చానల్ ద్వారా ఎల్లెల్సీ నీటిని రోజుకు 50 క్యూసెక్కుల ప్రకారం గాజులదిన్నె ప్రాజెక్టులోకి మళ్లించినట్లు ఎల్లెల్సీ ఏఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గోనెగండ్ల సెక్షన్‌కు ఎగువ ప్రాంతం నుంచి 115 క్యూసెక్కుల నీరు జీడీపీకి చేరుతోంది. అందులో 50 క్యూసెక్కులు జీడీపీకి మళ్లించగా, కోడుమూరుకు 50 క్యూసెక్కులు మిగిలిన నీటిని పీడీ, ఎంఎల్ఎస్‌పీ కాలువలకు విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఆ నీటిని గోనెగండ్ల, అలువాల, ఎస్ఎస్ ట్యాంక్‌లకు ఏనుగబాల చెరువుకు విడుదల చేస్తున్నామన్నారు.

దేవనకొండ సీఐగా గిరిబాబు

దేవనకొండ ,సెప్టెంబరు 11: సీఐగా గిరిబాబు బాధ్యతలు చేపట్టారు. కర్నూలు నుంచి వచ్చారు. నెల క్రితం నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. దేవనకొండ కేటాయించిన వంశీనాథ్ ఏసీబీ కేసులు పూర్తి చేసుకోని వచ్చేదాకా సీఐగా పంపిన్నట్లు పోలీసు అధికారుల సమాచారం.

కుటీర పరిశ్రమల్లో రాణించాలి

మద్దికెర, సెప్టెంబరు 11: నిరుద్యోగులు కుటీర పరిశ్రమల్లో రాణించాలని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. బుధవారం ఎస్సీ కాలనీలో శ్రీలక్ష్మి రుణం కింద బెరడు విస్తారకుల ప్యాక్టరీని ఉమాదేవి పరిశీలించారు. ఏపీఎం మధుబాబు ఉన్నారు.

సేవా రత్న అవార్డుకు ఎంపిక

ఆదోని టౌన్, సెప్టెంబరు 11: ఆదోనికి చెందిన వంకదారు శ్రీనాథ్ గుప్తా భారత్ సేవా రత్న అవార్డుకు ఎంపికైయ్యారు. బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 12వ వార్షికోత్సవం సందర్భంగా 14వ తేదీన బెంగళూరులో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును బహుకరించనున్నారు.

స్కూటీ దహనం

ఆలూరు, సెప్టెంబరు 11: పట్టణంలోని సంత మార్కెట్‌లో బుధవారంలో ఏపీ 39 డీఆర్ 1410 నెంబరు గల స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు ఉధవారం దహనం చేశారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

లింగాకర్షక బుట్టలు తప్పనిసరి

గోనెగండ్ల, సెప్టెంబరు 11: పత్తి పంటకు లింగాకర్షక బుట్టలు తప్పనిసరని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. బుధవారం హెచ్. కైరవాడి గ్రామంలోని 20 ఎకరాలలో వ్యవసాయశాఖ అధికారులు పత్తి రైతు ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల పత్తి రైతులు హజరయ్యారు.

వరద బాధితులకు టీడీపీ నాయకుల సాయం







దుప్పట్లు, వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ, కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కేఈ, వీరభద్రగౌడ్

విజయవాడలో ఇంటింటికీ తిరిగి అందజేత

ఎమ్మిగనూరు, సెప్టెంబరు11: విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు.



మంత్రి లోకేశ్‌తో వైకుంఠం దంపతులు



ఎమ్మిగనూరులో మల్లెల గ్రూప్ ఆధ్వర్యంలో..

పత్తికొండ: వెయ్యి నిత్యావసరాల కిట్లను బుధవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పంపిణీచేశారు. విజయవాడ 48వ డివిజన్ పరిదిలోని భవానిపురంప్రాంతంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో పాటు టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జ్ఞానేశ్వర్‌గౌడ్, సుబ్బరాయుడు, ఎల్వీప్రసాద్, శ్రీధర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు.

ఆలూరు: విజయవాడ వైఎస్సార్ కాలనీలో టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్ 1,500 కిట్లు పంపిణీ చేశారు. టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి రూ.1లక్షను మంత్రి లోకేష్‌కు అందజేశారు.

కౌతాళం: వరద బాధితుల సహాయారథం టీడీపీ కౌతాళం అధ్యక్షుడు విశ్వనాథ్ విరాళాలు సేకరించారు. మంజునాథ, సిద్దు, రాజబాబు, భీమయ్య, సిద్దు, చంద్రశేఖర్, గిడ్డయ్యలు పాల్గొన్నారు.



మద్దికెర: కస్తూర్బా విద్యార్థినుల సాయం

కస్తూర్బా విద్యార్థినుల సాయం

మద్దికెర: వరద బాధితుల సహాయార్థం కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు రూ.5,100లు అందజేశారు. ఆపద్బాంధవ సేవా సమితి వ్యవస్థాపకులు చొక్కా సునీల్ కుమార్, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: పట్టణానికి చెందిన మల్లెల గ్రూప్స్ నిర్వాహకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు జూనియర్ కళాశాల వద్ద విరాళాలు సేకరించారు. సామేల్, నరసన్న పాల్గొన్నారు.


ఉద్యమాలకు సిద్ధం

వెల్దుర్తి, సెప్టెంబరు 11: విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. వెల్దుర్తిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

ఎఫ్‌సీలు ప్రైవేటుకు ఇవ్వొద్దు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 11: వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరును ప్రైవేటుపరం చేయవద్దని సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

తుగ్గలి: డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లును ప్రభుత్వమే ఇవ్వాలని సీపీఎం అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రం అందించారు.



పత్తికొండ ఆర్డీవో ఆఫీసు వద్ద నాయకుల ధర్నా

ఎమ్మిగనూరు టౌన్: వాహనాల సర్వీసులను ప్రైవేటుపరం చేయొద్దని సీఐటీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం ఇచ్చారు.